ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

3★

శుక్రవారం 17 అక్టోబరు 2025

అన్నదాతలకు అడవి పందుల బెడద



పత్తి చెట్లను పాడు చేసిన పందులు

- చేతికి వస్తున్న వరి, పత్తి పంటల ధ్వంసం
- పంటలు రక్షించుకోవటానికి రైతుల అగచాట్లు
- సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

మంథని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అతి వృష్టి, అనావృష్టి కారణంగా సమతమతమైన అన్నదాతలు ప్రస్తుతం చేతికి వచ్చిన పంటలను కాపాడుకునేందుకు పడుతున్న బాధలు వర్ణణాతీతం. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికంది అమ్ముకునే దాకా రైతులకు ఇబ్బందులే. ఎడతెరిపి లేకుండా కురిసినా వర్షాలు, చీడపీడలతో పంటల దిగుబడులపై ప్రభావం చూపుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో పొట్ట దశలో ఉన్న వరి పంటల పై అడవి పందులు, కోతుల గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ పంటలను నాశనం చేస్తూ రైతులకు నష్టం కలగజేస్తున్నాయి. పందుల దాడితో ఒక్కోసారి రైతుల ప్రాణాల మీదికి వస్తున్నది.

ప్రకృతి వైపరీత్యాలకు తోడు జంతువులు కల్గించే నష్టంతో అన్నదాతలు కుదేలయ్యే పరిస్థితి నెలకొంది. తాము వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండిస్తున్న పంటలను ఎలా కాపాడుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతుల బెడదతతో ఆయా గ్రామాల్లో కూరగాయలు మొక్కలు, పండ్ల చెట్లు పెంచుకునే పరిస్థితి లేకపోవడం గమనార్హం. నిత్యం కోతుల కాపలా కాయలేక పోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలువురు కోతుల నుంచి రక్షించుకోవడానికి పరుగెత్తి కిందపడి కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నారు. ప్రభుత్వం స్పందించి అడవి పందులు, కోతులను నియంత్రించడంతోపాటు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

రైతులకు పలు సూచనలు చేస్తున్నాం

అంజనీమిశ్రా, ఏడీఏ, మంథని.



డివిజన్ పరిధిలో చేతికి వచ్చిన వరి, పంటలను రైతులు అడవి పందులు, కోతుల భారీ నుంచి రక్షించుకోవటానికి పలు సూచనలు అందిస్తున్నాం. పంటల చుట్టూ కందకాలు తవ్వుకోవాలి. గన్, బ్లాస్టింగ్, ఇతర శబ్దాలు వచ్చే మైక్‌లను ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ కనెక్షన్ లేకుండా వైర్ కంచె వేసుకోవాలి. ఏవోలు, ఏఈవోలు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ పంటల రక్షణకు రైతులకు సూచనలు ఇస్తున్నాం.

అడవిపందులతో వరి, పత్తి పంటలు ధ్వంసం..

డివిజన్‌లో సుమారు 52 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరి, 9 వేల ఎకరాలకు పైగా పత్తి పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అటవీ ప్రాంతం, గ్రామాల సమీపంలో దగ్గరగా ఉన్న పొలాలు, చేలు అనే తేడా లేకుండా అడవి పందులు ధ్వంసం చేస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల పరిధిలో పత్తి చేన్లు, వరి పొలాలను అడవి పందులు పాడు చేస్తున్నాయి. పత్తి చేనులో 20శాతం పంటను పందులు నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల నుంచి అడవి పందుల వల్ల వందల

మిగతా 6వ పేజీలో..

రామగుండంలో పనుల నాణ్యతపై ఫోకస్

- పలు రోడ్లకు కోర్ కంటింగ్‌లు

కోల్‌సిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతపై ఫోకస్ పెట్టారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఇప్పటికే అధికారులకు సూచించారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల కొందరు పనుల నాణ్యత విషయంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్ ప్రత్యేకాధికారి అయిన కలెక్టర్ ఆదేశాలతో కమిషనర్ నాణ్యతను పరీక్షించాల్సిందిగా ఆర్‌అండ్‌బీ క్వాలిటీ విభాగానికి లేఖ రాశారు. కార్పొరేషన్‌లో టీయూఎఫ్ఐడీసీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కొన్ని చోట్ల రోడ్లు పగుళ్లు వచ్చాయని, మరి కొన్ని చోట్ల సిమెంట్ లేయర్ తొలగిపోయిందనే ఫిర్యాదులు ఉన్నాయి. కమిషనర్ లేఖ మేరకు గురువారం ఆర్‌అండ్‌బీ క్వాలిటీ విభాగం ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ ఏఈ, డీఈలు గోదావరిఖని సప్తగిరికాలనీ-స్లాటర్‌హౌస్ రోడ్డు, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో కోర్ కటింగ్ చేశారు. వీటిని హైదరాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ ల్యాబ్‌కు పంపనున్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

కోల్‌సిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈనెల 21 నుంచి 31వ తేది వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ పేర్కొన్నారు. పోలీస్ అధికారులకు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు, రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తామని, అమరుల కుటుంబాల వద్దకు వెళ్లి వారి త్యాగాలకు గుర్తుగా నివాళులర్పిస్తామన్నారు. 21న హెడ్ క్వార్టర్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణలో స్మృతి పరేడ్, ఫ్లాగ్‌డేలను నిర్వహిస్తామన్నారు. షార్ట్ ఫిల్మ్‌లు, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోలీసులకు సంబంధించి అంశాలపై ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్‌లు తీయడానికి జిల్లాలో ఆసక్తి గల ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు ముందుకు రావాలని సీపీ కోరారు. పోలీస్ త్యాగాలు, పోలీస్ విధుల్లో ప్రతిభ తెలిపే విధంగా తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల షార్ట్ ఫిల్మ్‌లను పంపాలన్నారు. షార్ట్ ఫిల్మ్‌లను పెన్‌డ్రైవ్‌లో లోడ్ చేసి కమిష నరేట్‌లోని ఎస్‌బీ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీలోగా అందించాలన్నారు. కమిషనరేట్ స్థాయిలో ఎంపికైన షార్ట్ ఫిల్మ్‌లు, ఫొటోలు రాష్ట్ర స్థాయికి పంపుతామన్నారు. 21 నుంచి 30వరకు కళా బృందాలతో ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు సీపీ పేర్కొన్నారు.

రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జై కుమార్

గోదావరిఖని, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రానున్నదని ఏఐసీసీ పరిశీలకులు, తమిళనాడు మాజీ ఎంపీ జై కుమార్ అన్నారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో, జిల్లాలో బలోపేతం చేయడానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తుందని, 22నెలల కాలంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విమానాశ్రయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూ సర్వే నిర్వహించడం శుభ పరిణామమన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తప్పకుండా పదవులు వస్తాయని, కాంగ్రెస్ పార్టీ 33జిల్లాల్లో నూతనంగా అధ్యక్షులను మార్పు చేయనున్నట్టు, నూతన జిల్లా అధ్యక్షపదవి ఎంపికకోసం అభిప్రాయసేకరణను నిర్వహించడం జరుగుతుందని, పోటీలో ఉండే పోటీదారుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నట్టు, ఈనెల 19వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుందని, 22న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు జాబితాను అందిస్తామని, తదుపరి అధిష్టానం ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తుందన్నారు. నేషనల్ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ పెతూరి వెంకటేష్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ కాసిపాక రాజేష్, ప్రొటోకాల్ కో ఆర్డినేటర్ బాసిద్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి,పెద్దెల్లి ప్రకాష్, అనుమ సత్యనారాయణ, సర్వర్, హమీద్, దాసరి విజయ్ పాల్గొన్నారు.

కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించండి...

పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా కొత్త నాయకత్వానికి అవకాశం ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకులు గుమ్మడి కుమారస్వామి ఏఐసీసీ పరిశీలకులు జై కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం జ్యోతిభవన్‌లో పరిశీలకుడిని కలిసి జిల్లా అధ్యక్షుడు, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడి నియామకంపై వారు చర్చించారు. కాంగ్రెస్ పార్టీని బలపరిచే దిశగా కార్యకర్తలను ప్రోత్సహించాలని, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో క్రమశిక్షణ, పార్టీ కోసం త్యాగం చేసిన వారిని అధ్యక్ష పదవిని ఇవ్వాలని ఆయన కోరారు. పరిశీలకుడిని కలిసిన వారిలో ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ కోటేశ్వర్లు, దుబాసి మల్లేష్, ఊట్ల కిరణ్ ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు

రేపు బీసీ సంఘాల బంద్
బీఆర్ఎస్ మద్దతు



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల తరహాలోనే 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్‌డ్రామాలు ఆడుతూ తెలంగాణ బీసీ బిడ్డలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. గురువారం హైదరాబాదు తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ అధికారం కోసం బీసీ వాదాన్ని ఎత్తుకున్న కాంగ్రెస్, నేడు నమ్మించి మోసం చేసిందన్నారు. బీసీ రిజర్వేషన్లపై 22నెలలుగా మసిబూసిమారేడు కాయ చేసి నిండా ముంచిందన్నారు. మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ధి పొందాలని కుట్ర చేసిందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం, 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్టబద్దత కోసం కేంద్రాన్ని పట్టుబట్టాల్సిన రేవంత్‌రెడ్డి తెలివిగా దాన్ని పక్క దోవ పట్టించారని, బీసీలపై తమకు నిజంగానే ప్రేమ ఉన్నట్లు చాటుకునేందుకు నామమాత్రంగా జీఓ ఇచ్చి కొత్త నాటకానికి తెరతీశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారన్నారు. రిజర్వేషన్లు 50శాతం దాటకుండా సుప్రీంకోర్టు పరిమితి ఉందని, కేంద్రం వద్ద బిల్లు క్లియర్ కాదని తెలిసి 42శాతం బీసీ బిల్లు పేరుతో రేవంత్ ప్రభుత్వం డ్రామాలాడిందని, రాజ్యాంగ సవరణ లేకుండా అసెంబ్లీ తీర్మానంతో కోటారాదని విపక్షాలు, విద్యావంతులు చెప్పినా వినకుండా ఎన్నికల నోటిఫికేషన్ దాకా తెచ్చి చివరకు కోర్టు ముందు చేతులెత్తేసిందన్నారు. బీసీ సంఘాలు 18వ తేదిన తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. నాయకులు బొడ్డు రవీందర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, మేతుకు దేవరాజ్, మేడి సదానందం పాల్గొన్నారు.

సీపీఆర్‌పై మెడికోలకు అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వజనరల్ ఆసుపత్రిలో ప్రపంచ అనస్తిషియాడే సందర్భంగా గురువారం మెడికో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ మాట్లాడుతూ గుండె పోటుకు గురైన వ్యక్తులకు సీపీఆర్ చేసి బతికించవచ్చునని, గుండెపోటు వచ్చిన సమయంలో ఆపదలో ఉన్న వ్యక్తి సీపీఆర్ చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం వైద్య విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఎంఓ రాజు, వైద్య విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాల, మల్యాల గ్రామపరిధిలోని ఆదర్శ పాఠశాలలో గురువారం డాక్టర్ శ్రీచందన సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుండె నొప్పి వచ్చిన వ్యక్తి కిందపడితే సీపీఆర్ చేస్తే బతికే ఛాన్సు ఉంటుందని, దానిని ఎలా చేయాలో విద్యార్థులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ ప్రక్రియ ద్వారా అతనికి మెలకువ రాగానే వెంటనే ఆసుపత్రికి తరలిస్తే వారి ప్రాణాలు కాపాడిన వారమవుతామని అన్నారు. అలాగే కళ్లను ఎలా కాపాడుకోవాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలనే పలు అంశాలను విద్యార్థులకు తెలిపారు. హెల్త్ సూపర్ వైజర్ నీరజ, ప్రిన్సిపాల్ శ్రీదేవి, పోచయ్య, ఏఎన్ఎంలు సరోజన, సుధ, రజిత, ఆశాలు, భూలక్ష్మి, సరోజన పాల్గొన్నారు.

అత్యుత్తమ సేవలందిస్తున్న జిల్లా ఆసుపత్రి

వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్



ఆస్పత్రి భవన నిర్మాణ పనులను తెలుసుకుంటున్న కమిషనర్

పెద్దపల్లి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) రోగులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్న పెద్దపెల్లి జిల్లా ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని వైద్య విధాన్ పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ అభినందించారు. గురువారం అజయ్ కుమార్ జిల్లా ఆసుపత్రిను తనిఖీ చేశారు. ఆసుపత్రిని పరిశీలించి రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలు గణనీయంగా పెరిగినందున మెడికల్ సూపరింటెం డెంట్, వైద్యులు సిబ్బందిని కమిషనర్ ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యుత్తమ ఆస్పత్రులలో ఒకటిగా పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి నిలుస్తుందని, ఇదే స్ఫూర్తి భవిష్యత్‌లో కొనసాగించాలని కమిషనర్ సూచించారు. జిల్లా ఆస్పత్రిలో వైద్యులంతా సకాలంలో విధులకు హాజరవుతూ ఔట్ పేషెంట్ సేవలలో పాల్గొనాలన్నారు. నూతన ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌ను వేగవంతంగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొనిరావాలని తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



గొర్రెలకు నట్టల మందు వేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు, గొర్రెల కాపరులు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం నిట్టూరులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా పశు వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వం తరఫున పశు సంక్షేమం, పాడి రైతులకు అమలు చేస్తున్న కృత్రిమ గర్భధారణ సేవలు, గొర్రెల కాపరులకు అందుతున్న టీకాలు, నట్టల నివారణ చర్యల గురించి వివరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె విజయ భాస్కర్, అసిస్టెంట్ సంచాలకులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వేణుగోపాల రావు, తెలంగాణ పశువు గణన అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సత్య ప్రసాద్ రెడ్డి, వెటర్నరీ సర్జన్ లు డాక్టర్ అఖిల్ రాజు ,డాక్టర్ అనిల్ కుమార్ ,డాక్టర్ సురేష్ ,డాక్టర్ రవి, కాంగ్రెస్ నాయకులు గిరినేని సంపత్ రావు, మందల సత్యనారాయణరెడ్డి, ప్రదీప్, వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

నేషనల్ హైవే భూ సేకరణ సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు సంబంధించి భూ సేకరణ సమస్యలను ఈనెల 24లోపు పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల్లో పలు అభివృద్ధి పనుల పై వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. అనంతరం మహిళా కుట్ట మిషన్ ట్రైనింగ్ సెంటర్‌ను కలెక్టర్ శ్రీహర్ష ప్రారంభించారు. ప్రభుత్వ సంగీత కళాశాలను, డే కేర్ సెంటర్‌ను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంథని పట్టణంలో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణాలు, స్ట్రీట్ లైట్ల ఏర్పాట్లు లాంటి అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు.

కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మంచిర్యాల-వరంగల్ నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి జిల్లాలో భూ బదలాయింపు చివరి దశకు చేరుకుందన్నారు. భూసేకరణ, పరిహారం చెల్లింపు పనులు ఈనెల 24వ తేదీలోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఈనెల 30లోపు మంథని, ముత్తారం, రామగిరి మండలాల్లో హైవే గ్రావెల్ పనులు పూర్తి చేయాలన్నారు. టైలరింగ్‌లో మహిళలు శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందాలన్నారు. వయోవృద్ధులకు అనుకూలంగా ఉండేలా వారంలో లోగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఎన్‌హెచ్ పీడీ కీర్తి భరద్వాజ, మెగా ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వరి కోతలు



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న రైతులు

సుల్తానాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వానాకాలానికి సంబంధించిన వరి పంటలు చేతికందాయి. సుల్తానాబాద్ మండలంలోని పలు గ్రామాలలో హార్వెస్టర్‌తో వరి కోతలు ప్రారంభించారు. మండలంలో వానాకాలం సీజన్‌లో దాదాపు 25 వేల ఎకరాలలో వరి పంటలు సాగు చేసినట్లు అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి. ఈసారి సమృద్ధిగా వర్షాలు కురవడం, శ్రీరాంసాగర్ నుంచి సాగునీరు రావడంతో రైతులు పంటలు సాగు చేసుకున్నారు. పంటలు చేతికందే సమయంలో వరుసగా కురిసిన వర్షాల వల్ల రైతులు కొంత ఆందోళన చెందారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండానే వాతావరణం అనుకూలించింది. అయితే వరి పంటలు చేతికందిన కొందరు సమీప రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ఈ సారి క్వింటాలుకు 2389 రూపాయలు ప్రకటించింది. మిల్లుల్లో క్వింటాలు ధాన్యం పదహారు వందల రూపాయలు ఇస్తున్నట్లు రైతులు తెలిపారు. అత్యవసర పరిస్థితులలో కొందరు రైతులు మిల్లుల వద్ద అమ్ముకుంటున్నారు.

సీఎంఆర్‌కు సంబంధించిన బియ్యం రికవరీలో మిల్లర్ల నుంచి బాయిల్డ్ రైస్‌ను ప్రభుత్వం ఆశిస్తోంది. మిల్లర్లు దళారుల ద్వారా పొలాల నుంచి నేరుగా కొనుగోలు చేసి మిల్లులకు వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. రైతులకు కూడా ధాన్యం విక్రయాల తిప్పలు తప్పనున్నాయి. వడ్లను ఆరబెట్టడం తేమ శాతం రావడం వంటి ఇబ్బందులు లేకుండా పోతున్నాయి. ధర తక్కువ వచ్చినా మిల్లులకే విక్రయిస్తున్నారు. లేదంటే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించడం, అక్కడ స్థల సమస్యతోపాటు రోజుల తరబడి ఆర బెట్టడం, కాపలా ఉండడం, సకాలంలో గన్నీ సంచులు రాకపోవడం లారీలు హమాలీల సమస్యలు ఉండడంతో డైరెక్ట్‌గా మిల్లులకు తరలించడమే మేలంటూ కొందరు రైతులు అభిప్రాయపడుతున్నారు.



కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలి

మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు



మండలంలో వరి కోతలు అక్కడక్కడా మొదలైనా ఇంకా వారం పది రోజుల వరకు అన్ని గ్రామాలలో ప్రారంభమవుతాయి. అయితే రైతులు తొందరపడి పంట దిగుబడులను తక్కువ ధరలకు అమ్ముకోవద్దు. త్వరలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యాన్ని విక్రయించుకుని ప్రభుత్వ మద్దతు ధర పొందాలి. మండలంలో రైతులకు అందుబాటులోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. సకాలంలో కొనుగోలు జరుపుతారు. కేంద్రాలలో అన్ని వసతులు సౌకర్యాలు ఉంటాయి.

27 గ్రామాలలో కేంద్రాలు

కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్



సుల్తానాబాద్ మండలంలో ఐదు సహకార సంఘాలున్నాయి. వాటి పరిధిలో మొత్తం 27 గ్రామాల రైతులకు సౌకర్యవంతంగా ఉండేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలు దీపావళి తర్వాత ఏర్పాటు చేస్తాం. రైతులు గ్రామాలకు వచ్చే దళారులకు గానీ తక్కువ ధరకు మిల్లర్లకు అమ్ముకుని నష్టపోవద్దు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మాత్రమే విక్రయించి మద్దతు ధరను, మరో వైపు సన్న రకం ధాన్యానికి బోనస్ పొందాలి.

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి ఆత్మహత్య

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు బలవన్మరణం చెందారు. వీరిలో నలుగురు ఉరి వేసుకోగా ఒకరు పురుగుల మందు తాగారు. వివరాల్లోకి వెళితే..

ఉరి వేసుకుని..


రాజేశం(ఫైల్)

కమాన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన గుర్రాల రాజేశం(60) గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజేశం కొంతకాలంగా ఒంటరిగా ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలానికి ఎస్‌ఐకొట్టేప్రసాద్, ఏఎస్‌ఐఖలీల్‌ఖాన్, సిబ్బంది రమీజ్ పరిశీలించారు. మృతుడి సోదరుడు గుర్రాల చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


శివకుమార్(ఫైల్)

వెల్గటూర్: వెల్గటూర్ మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన తనుగుల శివకుమార్ (33) అనేయువకుడు గురువారం ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపినవివరాల ప్రకారం శివకుమార్ నాలుగు సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం వెళ్లాడు. సంవత్సరం తర్వాత అనారోగ్య కారణంగా మతిస్థిమితం కోల్పోయాడు. అక్కడి వారి సహాయంతో సొంత గ్రామానికి తిరిగి వచ్చాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని మందులు వాడుతున్నప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. దీనితో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి తనుగుల వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జ్యోతినగర్: స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన కాసుల రాకేష్(31) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగు రోజులక్రితం ఆత్మ హత్య చేసుకున్న రాకేష్ మృతదేహాన్ని గురువారం కనుగొన్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న రాకేష్ ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నాడు. ఏడాది క్రితం అతని తండ్రి, 15రోజుల క్రితం రాకేష్ తల్లి చనిపోయింది. నాలుగు రోజుల క్రితమే తండ్రి సంవత్సరీకం, తల్లి దశదిన కర్మ నిర్వహించాడు. రాకేష్‌కు అక్క, బావ ఉన్నారు. దశదిన కర్మ జరిగిన రోజున బావతో రాకేష్ గొడవ పెట్టుకు న్నాడు. దీంతో అక్క, బావలు ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు దూరమైన బాధలో ఉన్న సమయంలో అక్కాబావలు కూడా దూరం కావడంతో రాకేష్ మనస్తాపానికి గురైనట్లు తెలుస్తున్నది.. ఈ క్రమంలో అదేరోజు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమా చారం ఇచ్చారు. పోలీసులు తలుపు తెరవడతో రాకేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడైంది.. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మాధురి(ఫైల్)

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన మాధురి(22) అనేవివాహిత బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గురువారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎక్కల్‌దేవి రవి 2024ఆగస్టు 24న మాధురిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్ని రోజుల నుంచి అత్తింటి వేధింపులతో మాధురి బాధ పడుతుండేదని, భర్త ఎక్కల్‌దేవి రవి, అత్త ఎక్కల్‌దేవి సత్తమ్మ, మామ రాజం, ఆడబిడ్డ రవళి వేధింపులతో మాధురి ఆత్మహత్య చేసు కుందని తల్లి ఎర్ర లావణ్య పోలీసులకు ఫిర్యా దు చేసింది. తహసీల్దార్ నీత సమక్షంలో పంచనామా చేసి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. భర్త, అత్తమామను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైఎస్సై-2 రాజునాయక్ తెలిపారు.

పురుగుల మందు తాగి..

రుద్రంగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పిట్టల నర్సయ్య (62)అనేవ్యక్తి బుదవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులుతెలిపిన వివరాల ప్రకారం పిట్టల నర్సయ్య అప్పుల బాధతో మనస్థాపానికి గురై బుదవారం పొలంవద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు జీవం



రంగులతో అందంగా కనిపిస్తున్న చింతకుంట పాఠశాల

రూ.4.10 లక్షలతో మౌలిక వసతుల కల్పన

ఆదర్శంగా నిలుస్తున్న చింతకుంట గ్రామస్థులు

దాతల సహకారంతో ముగ్గురు విద్యా వలంటీర్ల నియామకం

కథలాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం చింతకుంట ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు గ్రామస్థులు జీవం పోశారు. అరకొర వసతులు, విద్యార్థులు లేక బోసిపోతున్న పాఠశాలల రూపు రేఖలు గ్రామస్థుల సహకారంతో ఒక్కసారిగా మారిపోయాయి. యువత, గల్ఫ్ వలస జీవులు, మహిళలు, కుల సంఘాలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీలకు అతీతంగా నేతలు ఒక్కటై రూ.4.10 లక్షలు పోగు చేసి విద్యార్థుల సంఖ్యను అనూహ్యంగా పెంచి పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం ఆ మారుమూల పల్లెలో సర్కారు బడి సౌకర్యాలు సమ కూర్చుకొని విద్యార్థులతో సందడిగా కనిపిస్తోంది.

ప్రైమరీ, హైస్కూల్‌లో పెరిగిన విద్యార్థులు

ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది కేవలం 50 మంది మాత్రమే చదువుతుండేవారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 131 మందికి చేరింది. ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 53 మంది ఉండగా ప్రస్తుతం 101 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత వేసవి సెలవుల్లో గ్రామస్థులంతా కలిసి తమ పిల్లలను ప్రైవేట్ బడికి పంపవద్దని నిర్ణయించుకున్నారు. మూతపడే పరిస్థితికి చేరిన పాఠశాలను బతికించుకునేందుకు ఎన్‌ఆర్‌ఐ, యువజన సంఘాలు, మహిళలు, ప్రజాప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి విరాళాల సేకరణకు పూనుకున్నారు. రూ.4.10 లక్షలు పోగు చేసి పాఠశాలకు గేట్లు ఏర్పాటు చేశారు. చిన్నారులను విద్య పట్ల ఆకర్షితులను చేయా లనే తలంపుతో పాఠశాల గోడలపై ఆకర్షణీయమైన రంగులతో బొమ్మలు వేయించారు. సైన్స్, సోషల్‌కు సంబంధించి పటాలను ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ప్రహరీ లేకపోవడం వల్ల చుట్టూ రంగుల నెట్‌ను రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్నారు.

2009-10 పదో తరగతి పూర్వ విద్యార్థులు హైస్కూల్‌లో ఫిల్టర్ వాటర్‌ప్లాంట్, 2011-12 బ్యాచ్ విద్యార్థులు వాటర్ ట్యాంక్, ఎలక్ట్రికల్ బెల్ ఏర్పాటు చేయించారు. పాఠశాలల్లో సీసీ కెమెరా లు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. విద్యా ర్థుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ప్రాథమిక పాఠశా లలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. దీంతో ఇద్దరు దాతల సహకారంతో ముగ్గురు విద్యా వలంటీర్లను నియమించారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ప్రీ ప్రైమరీలోనూ 20 మంది ప్రవేశాలు పొందారు.

అదనపు తరగతి గదులు అవసరం..

సుధాకర్, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం



ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య ఊహించని విధంగా పెరగడానికి గ్రామస్థులు చేసిన కృషి ఎంతో ఉంది. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుంది. ప్రస్తుతం ఉన్న ఐదు గదు లు సరిపోవడం లేదు. ప్రీప్రైమరీ కూడా కొనసాగిస్తున్నందు వల్ల అదనంగా తరగతి గదులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మరుగుదొడ్డి, గదుల మరమ్మతులు కొనసాగుతున్నాయి.

బోరు ఏర్పాటు చేయాలి..

: రవి, హైస్కూల్ హెచ్‌ఎం



రెండు పాఠశాలలు ఒకే ఆవరణలో ఉండగా తాగునీటికి బోరు లేదు. గ్రామస్థులను ఒప్పించి పక్కనే ఉన్న బోరును వినియోగించుకుంటున్నాం. నీరు సరిపోవడం లేదు. ప్రహరీ నిర్మాణం చేయాల్సి ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ఇదే ఆవరణలో కొనసాగుతున్నాయి. మౌలిక వసతులు ఉంటేనే విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపుతారు.



ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు, పాఠశాల చుట్టూ రక్షణ కోసం చేసిన ఏర్పాట్లు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లందకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) ఇల్లందకుంట మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. జమ్మికుంట మానేరు పరివాహ ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ఇసుక ట్రాక్టర్లు సిరిసేడు వస్తుండగా, ఆపి తనిఖీచేశారు. సంబంధిత పత్రాలు లేకపోవడంతో రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని గద్దపాక గ్రామ శివారులో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్దపాక గ్రామానికి చెందిన జక్కుల దేవేందర్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకరవాణా చేస్తుండగా గ్రామశివారులో పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరళిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మల్లారెడ్డిపేటకు చెందిన చందు, నందం అనే వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నారని ఎస్‌ఐ అనిల్ కుమార్ తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరళించినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ వెల్లడించారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి

ఓదెల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో గురువారం పొత్కపల్లి పోలీసులు పేకాటకేంద్రంపై దాడి చేశారు. గ్రామశివారులో కొందరు పేకాట ఆడుతుండగా ఐదుగురిని అదుపులోకితీసుకొని వారినుంచి రూ.3,500 స్వాధీనం చేసుకున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ, గ్రామాల్లో యువకులు, జూదం, ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు.

రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ పోటీలు ప్రారంభం

● బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నీస్ క్రీడల్లో పోటీలు ● పోటీలను ప్రారంభించిన జోనల్ సీఈ విజయ్‌కుమార్


ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయంలో బాస్కెట్‌బాల్‌లో తలపడుతున్న నల్గొండ, కరీంనగర్ జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ సర్కిల్‌ల బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నీస్ పోటీలు జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఎన్‌పీడీసీఎల్ ఆపరేషన్‌సర్కిల్ బాస్కెట్‌బాల్ కోర్టులో గురువారం ప్రారంభమయ్యాయి. కరీంనగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఓఎంసీ సర్కిల్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని 10సర్కిళ్ల టేబుల్ టెన్నీస్ జట్లు, ఏడు సర్కిళ్ల బాస్కెట్‌బాల్ జట్లు పాల్గొంటున్నాయి. పోటీలను కరీంనగర్ జోనల్‌సీఈ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ సర్కిల్ క్రీడలకు పెట్టింది పేరన్నారు. పలు క్రీడాంశాల్లో ప్రతిభచాటి విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్‌ను కరీంనగర్ సర్కిల్ సాధిస్తుండడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్ ఎల్లవేళలా క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహిస్తాయన్నారు. ఈనెల 18వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో కరీంనగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌ఈ ఎన్ శ్రీనివాస్, ఎస్‌ఈ ఆపరేషన్ ఎం రమేష్ బాబు, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎన్ జగన్నాథ్, కరీంనగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు పి రఘునందన్, ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మొదటి రోజు బాస్కెట్‌బాల్ పోటీల ఫలితాలు...

మొదటిమ్యాచ్‌లో కరీంనగర్ ఆపరేషన్‌జట్టు నల్గొండ ఆపరేషన్ జట్టుతో తలపడగా కరీంనగర్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఓఎంసీ కరీంనగర్‌జట్టు నిజామాబాద్ ఆపరేషన్ జట్టుతో తలపడగా నిజామాబాద్ ఆపరేషన్ జట్టు విజయం సాధించింది. మూడోమ్యాచ్‌లో నల్గొండ ఆపరేషన్ జట్టు నిజామాబాద్ ఓఎంసీ జట్టుతో తలపడగా నల్గొండ జట్టు విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో కరీంనగర్ ఓఎంసీ జట్టు ఖమ్మం ఆపరేషన్ జట్టుతో తలపడగా ఖమ్మం ఆపరేషన్ జట్టు విజయం సాధించింది.

బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు, ఒకరి అరెస్ట్

వేములవాడ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మీడియా ముసుగులో బెదిరింపులకు పాల్పడుతున్న వేములవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్‌చేసినట్లు టౌన్‌సీఐ వీరప్రసాద్ తెలిపారు. వేములవాడ టౌన్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణం అగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మెల మహిపాల్ అనేవ్యక్తి వృత్తిపరంగా ఒగ్గు కళాకారుడు. గంగాదేవిని పూజిస్తూ సవుడాలమ్మ పూజలు చేస్తూ మూలికల వైద్యం ద్వారా జీవనోపాధి పొందుతున్నాడు. ఈనెల 11న వేములవాడకు చెందిన ఓవ్యక్తి జర్నలిస్ట్ ముసుగులో మహిపాల్‌కు ఫోన్‌చేసి నీవు వేములవాడకు రావాలని రాకపోతే నీపై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. మహిపాల్ వేములవాడకు వచ్చి ఆ వ్యక్తిని కలుసుకోగా ఏ విషయమై నాపై ఫిర్యాదు చేస్తావని అడిగితే పొంతనలేని సమాధానాలు చెప్పడమే కాకుండా నీ గురించి పేపర్‌లో రాస్తానని బెదిరించాడు. మరుసటి రోజు మళ్లీ ఆవ్యక్తి ఫోన్‌చేసి నీవు ఒకరిని మోసం చేశావని బాధితులు పేపర్‌లో రాయమని ఒత్తిడిచేస్తున్నారని రాయకుండా ఉండాలంటే మరోవ్యక్తి అయిన రాజుకి రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. భయభ్రాంతులకు గురైన మహిపాల్ ఈనెల14న ఫోన్‌పే ద్వారా రూ.10 వేలు చెల్లించాడు. అయినప్పటికీ మిగితా రూ.20వేలు ఇవ్వాలని బెదిరించాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి కరుణాకర్ అనే వ్యక్తి రిమాండ్‌కు తరలించామని, రాజు పరారీలో ఉన్నాడని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత


పోలీస్ స్టేషన్‌కు తరలించిన మట్టి ట్రాక్టర్లు

చందుర్తి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకున్నట్లు చందుర్తి ఎస్‌ఐ రమేష్ గురువారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం గురువారం మర్రిగడ్డ నుంచి దేవునితండా ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా జోగాపూర్ గ్రామ శివారులో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను, డ్రైవర్లు అఋగుల దేవరాజ్, రత్నం సంజీవ్ అదుపులోకి తీసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ జె. రమేష్ తెలిపారు.

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధరలు

వేములవాడ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులు పండించిన ధాన్యం కనీసం మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈసందర్భంగా 2025-26 సంవత్సరానికి మార్కెట్‌కమిటీ కార్యదర్శి సత్యనారాయణ ధరల పట్టికలో మద్దతు ధరలను గురువారం పొందుపరిచారు. రైతులు పండించిన వివిధరకాల ధాన్యాలకు ప్రభుత్వం ప్రకటించిన ఒకక్వింటాలు ధరలు ఇలా ఉన్నాయి. ధాన్యం సాధారణరకం రూ.2,369, ధాన్యం గ్రేడ్ ఏరకం రూ.2,389, జొన్నలు హైబ్రీడ్ రకం రూ. 3,699, జొన్నలు మాల్దండి రకం రూ.3,749, సజ్జలు రూ. 2,775, రాగులు రూ.4,886, మొక్కజొన్న రూ. 2,400,కందులురూ.8వేలు, పెసర్లురూ.8,768, మినుములు రూ.7,800,వేరుశనగకాయలు రూ.7,263, పొద్దుతిరుగుడు రూ.7,721, సోయా చిక్కుడు రూ.5,328, నువ్వులు రూ.9,846, వలసలు (గడ్డినువ్వులు) రూ.9,537, పత్తి మధ్యరకం పింజ రూ.7,710, పత్తిపొడుగు రకంపింజరూ.8,110క్వింటాళకు ధరలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సుల్తానాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో కొనుగోలు చేసిన ద్విచక్రవాహనంపై సంతోషంగా ఇంటికి వస్తున్న ఓవ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్ కుమార్‌తెలిపిన వివరాల మేరకు.. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన ఆడేపు కుమార్ (54) కరీంనగర్‌లో సెకండ్ హ్యాండ్‌బైక్ కొనుగోలు చేశాడు. అదే బైకుపై ఇంటికి వస్తున్నాడు.

మరో ఐదునిమిషాల్లో ఇంటికి చేరుతాడనగా, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి-సుల్తాన్‌పూర్ గ్రామాలమధ్య సైకిల్‌ను ఢీకొని కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో ఆడేపు కుమార్ మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాద వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసు పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు బస్సులు

శంకరపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్ ఎదుట గురువారం రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్, సిరిసిల్ల డిపోలకు చెందిన బస్సులు బస్టాండ్ ఎదుట ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో బస్సుల్లోని కొంత మంది ప్రయాణీకులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సుల ముందు భాగం పాక్షికంగా దెబ్బతిన్నాయి.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● నాలుగు తులాల బంగారం, నగదు అపహరణ


బీరువా తాళలు పగలగొట్టి బట్టలను చెల్లా చెదురు చేసిన దొంగలు

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని హన్‌మాన్‌నగర్‌లో బుధవారం రాత్రి దొంగలు ఓ ఇంటి తాళం పగులగొట్టి 4తులాల బంగారం, 50వేల నగదును ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్‌మాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న మానస అనే గృహిణి బుధవారం రాత్రి తన ఇంటికి తాళం వేసి తల్లిగారి ఇంటికి వెళ్లింది. గురువారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 4తులాల బంగారం, నగదు మాయమైనట్లు గుర్తించింది. బాధితురాలు పోలీసులకు సమాచారం అందిచడంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన జక్కుల శ్రీనివాస్‌పై హత్యాయత్నం కేసులో ఇదే గ్రామానికి చెందిన నక్క రవిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం శ్రీనివాస్‌కు, రవిల మధ్య కొంతకాలంగా డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇరువురి మధ్య పంచాయతీలు కూడా జరిగాయి. డబ్బుల విషయంలో విసిగిపోయిన రవి గురువారం శ్రీనివాస్‌ను చంపివేయాలనే ఉద్దేశ్యంతో కూరగాయలు కోసే కత్తితో దాడిచేశాడు. దాడిలో శ్రీనివాస్‌కు చేతికి, గదవపై గాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, తదుపరి విచారణ చేపట్టిన సిరిసిల్ల సీఐ మొగిలి నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

ధర్మపురి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో గంజాయి సరఫరా చేస్తున్న చొప్పరి పృథ్వీరాజు అనేవ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ గురువారం తెలిపారు. ధర్మపురి పట్టణానికి చెందిన పృధ్వీరాజు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అతనిని సోదా చేయగా 103గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గంజాయి స్వాధీనంచేసుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

గర్రెపల్లిలో యువకుల వీరంగం

● చికెన్ సెంటర్ నిర్వాహకులపై కత్తులతో దాడి ● ముగ్గురికి గాయాలు


షాపులో నుంచి కత్తి తీస్తున్న యువకుడు

సుల్తానాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి బస్టాండ్ సమీపంలో మద్యం మత్తులో ముగ్గురు యువకులు వీరంగం సృష్టించారు. రోడ్డు పక్కనున్న చికెన్ సెంటర్ నిర్వాహకులపై యువకులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయగా, ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గురువారం రాత్రి గర్రెపల్లి బస్టాండ్ సమీపంలోని చికెన్‌సెంటర్ వద్దకు కారులో ముగ్గురు వ్యక్తులు బీర్లు తాగుతూ సీసాలు చేతిలో పట్టుకుని వచ్చారు. చికెన్ కావాలని నిర్వాహకులతో గొడవపడ్డారు. ఒక్కసారిగా యువకులు చికెన్ సెంటర్ నిర్వాహకులను చికెన్ కొట్టడానికి ఉపయోగించే కత్తిని తీసుకొని దాడిచేయగా, నిర్వాహకులు, రసీద్‌కు గాయాలయ్యాయి. గొడవను ఆపే ప్రయత్నంలో పక్కనున్న మరో దుకాణం యజమానిని కూడా కొట్టారు. అనంతరం ముగ్గురు యువకులు అదే కారులో పరారయ్యారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. పారిపోయిన వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ముగ్గురు యువకులు చికెన్ సెంటర్ నిర్వాహ కులపై దాడి చేశారని, వారి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.6700 పలికిన పత్తి ధర


పత్తి కొనుగోళ్లు పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

జమ్మికుంట రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6700 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 170మంది రైతులు 1292క్వింటాళ్ల విడి పత్తి, 30మంది రైతులు 44క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.6700, కనిష్ఠ ధర రూ.5300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం, మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించారు. శని, ఆదివారాలు సాధారణ సెలవు దినాలు కాగా, దీపావళి పండుగ సందర్భంగా సోమ, మంగళవారం యార్డుకు సెలవు దినాలు ప్రకటించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



చింటూ(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న జాతీయరహదా రిపై గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇసుక ట్రాక్టర్‌ను నడుపుతున్న ఓయువకుడు అక్కడి కక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగాపూర్ గ్రామానికిచెందిన చింటూ(22)ఇసుక ట్రాక్టర్‌ను నడుపుతున్నాడు. విలాసాగర్ నుంచి పెద్ద పాపయ్యపల్లెకు ఇసుకను అన్‌లోడ్ చేసిన అనంతరం తిరిగి తనస్వగ్రామానికి రంగాపూర్‌కు బయల్దేరాడు. ఈక్రమంలో రాంపూర్ శివారులో నిర్మాణంలో ఉన్న జాతీయరహదారిపై ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడపటం మూలంగా అదుపుతప్పి ట్రాక్టర్ ఒక్కసారిగా రహదారిమీద నుంచి పక్కనేఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కిందపడిన డ్రైవర్ చింటూ తీవ్రగాయాలై ఘటనస్థలంలోనే మృతిచెందాడు. విషయం తెలుకున్నపోలీసులు ఘటనస్థలానికి చేరుకున్నారు. ట్రాక్టర్‌కింద ఇరుక్కుపోయిన చింటూ మృతదేహాన్నిపోలీసులు స్థానికుల సహాయంతో బయటకు తీశారు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతు న్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మంథని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గొడుగు బిల్డింగ్ ఏరియా సమీపంలోని ఓ ఇంట్లో పట్టణానికి చెందిన బండారి శ్రీనివాస్ అనే యువకుడు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. శ్రీరామకాలనీ సమీపంలో కొనుగోలు చేసిన భూమిని యజమాని మరో వ్యక్తికి సైతం విక్రయించడంతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ తనకు భూమి అమ్మినవ్యక్తి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. దీంతో అక్కడే ఉన్న వారు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనం తరం మెరుగైన చికిత్సకోసం గోదావరిఖనికి తరలించగా చికిత్స పొందు తున్నాడు. ఈమేరకు పోలీసులు విచారిస్తున్నారు.

శ్రీరాంసాగర్ వరద గేట్ల మూసివేత

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను గురువారం మూసివేశారు. ఎగువ ప్రాంతం నుంచి 9,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 5,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు వదిలారు.

బంతి పూల సాగుతో భరోసా

- కిలో రూ. వంద వరకు పలికిన ధర
- రైతుల వద్ద కొనుగోలు చేసిన ప్రజలు





చొప్పదండి మండలంలో సాగవుతున్న బంతి పూల తోట, మానకొండూర్ మండలం లక్ష్మీపూర్‌లో పూలు తెంపుతున్న మహిళా రైతు

చొప్పదండి/మానకొండూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలు బంతి పూల సాగు చేసిన రైతులకు ఆర్థిక భరోసా కల్పించింది. అటు దిగుబడితో పాటు ఈసారి మంచి ధర పలకడంతో బంతిపూల రైతులకు కాలం కలిసి వచ్చింది. పంటకు పెట్టుబడి బాగా పెరిగినప్పటికీ, చాలా మంది రైతులు రోడ్లపై రిటైల్‌గా బంతి పూలను కిలో వంద రూపాయలకు అమ్ముకున్నారు. పూలు కావలసిన ప్రజలు కూడా బంతి పూల తోటల వద్దకు వెళ్లి కొనుగోలు చేశారు. ఎకరంలో 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు బంతి పూల దిగుబడి రావడంతో రెండు లక్షల వరకు పలువురు రైతులకు ఆదాయం లభించింది. బతుకమ్మ, దసరా పండుగలకు బంతి పూలకు ఈ సారి మంచి డిమాండ్ ఏర్పడడంతో పాటు మంచి ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



కాగా మరో మూడు రోజుల్లో దీపావళి పండుగ రానుండగా బంతి పూలకు డిమాండ్ బాగా ఉండడంతో రైతులు తమ పంటకు అదే ధర పలుకుతుం దనే ఆశతో ఉన్నారు. గతంలో బంతి పూలను 10, 20 రూపాయలకు కిలో అమ్మి నష్టపోయిన సందర్భాలు ఉండగా ఈ సారి మాత్రం కిలో పూలకు వంద రూపాయలు పలకడం రైతులను గట్టెక్కించింది. మండలంలో దాదాపు 200 ఎకరాల్లో బంతి పూల సాగును రైతులు చేపట్టారు.

● లక్ష్మీపూర్‌లో...

మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పెద్ది కావ్య-శ్రీనివాస్ అనే రైతు దంపతులు 20 గుంటల భూమిని కౌలుకు తీసుకొని బంతిపూల సాగు చేశారు. పువ్వులు పూరిత స్థాయిలో కోతకు రాకపోవడంతో ఇటీవల దసరా పండుగకు అమ్మకాలు తక్కువగా జరిగాయి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో కోత దశకు వచ్చింది. దీంతో రెండు రోజుల్లో పువ్వులను కోసి మార్కెట్‌కు తరలిస్తామని రైతు దంపతులు తెలిపారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ముద్దసాని రమేష్‌రెడ్డి

తిమ్మాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 14న ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ఐ జిల్లాస్థాయి అండర్19 వాలీబాల్ టోర్నమెంట్ గురువారం ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి బాలబాలికల విభాగంలో 85జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో మంచి ప్రతిభకనబరిచిన శ్రీ చైతన్య డిఫెన్స్అండ్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు మొదటిస్థానంలో నిలిచారు. ఈ ముగింపు కార్యక్ర మానికి విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాల్లో గెలుపు, ఓటములు సహజమని ఓడిన వారు నిరాశ పడకుండా, గెలుపు కోసం ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో గన్నేరువరం ఎస్ఐ రంజిత్‌కుమార్, ఎస్‌జీఎఫ్ఐ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్, డిఫెన్స్ అకాడమి ప్రిన్సిపాల్ పల్లె శ్యాం సుందర్‌రెడ్డి, డీన్ జగన్మోహన్‌రెడ్డి, పిడిలెంకల మహిపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సి పాల్ శ్రీనివాస్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వ్యక్తిపై దాడి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ అవరణలో మూత్రవిసర్జన చేసిన వ్యక్తిపై బుధవారం రాత్రి నలుగురు విచక్షణరహితంగా దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. తనను పోలీసులే కొట్టారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. కరీంనగర్‌కు చెందిన పరశురాం కూలీ పనిచేసుకుంటూ రోడ్లపైన జీవనం సాగిస్తున్నాడు. తాగినమత్తులో బస్టాండ్ ఆవరణలో మూత్ర విసర్జన చేయడంతో పలువురు కొట్టారు. దాడిలో చెయ్యి విరిగింది. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు రావడంతో చికిత్స నిమిత్తం పోలీసులు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. డాక్టర్లు చెయ్యి విరిగిందని సర్జరీ అవసరమని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్నాడు. పోలీసులు కొట్టారని బాధితుడు తెలపడంతో వన్‌టౌన్ పోలీసులు బస్టాండ్ అవరణలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

మత్స్యకారులకు అండగా నిలవాలి



మంత్రి శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు అండగా నిలువాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకటి శ్రీహరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్‌లో గురువారం జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘ చైర్మన్ చొప్పరి రామచంద్రం ఆధ్వర్యంలో కలిసి సమస్యలను వివరించారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో మత్స్యకారులకు సొసైటీ భవనాలు నిర్మించాలని, 55 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘ మాజీ అధ్యక్షుడు కంకటి ప్రభాకర్, నాయకులు కూనబోయిన పర్శరాం, శ్రీకాంత్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలం కేటాయించాలి



రగుడు బైపాస్ రహదారికి ఓ వైపు ఫ్లెక్సీ కట్టిన రైతులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలం కేటాయించాలని రైతులు రోడ్డును ఆక్రమించుకుని ఆందోళన చేపట్టారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనువైన స్థలాలు లేకపోవడం వల్ల ప్రధాన రహదారిపై ధాన్యం కుప్పలు పోయాల్సి వస్తోందని, వాహనదారులు మరోదారి నుంచి వెళ్లాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, సిరిసిల్ల విలీన గ్రామాల రైతులు వెంకటాపూర్ గ్రామ శివారులోని వెంకటాపూర్- రగుడు బైపాస్ రహదారికి ఓ వైపు గురువారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. రహదారిపై టైర్లు వేసి అడ్డుగా కట్టారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ప్రధాన రహదారిని మూసి వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్లెక్సీని తొలగించేందుకు యత్నించారు. దాంతో రైతులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ధాన్యం కుప్పలు పోసుకునేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు.అనంతరం రోడ్డుకు అడ్డుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని పోలీసులు తొలగించారు. కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఈ నెల 17న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు రైతులు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమం లో వెంకటాపూర్, సిరిసిల్ల విలీన గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం కొండంత..!

- దేవస్థానం పరిధిలో ఒక్కరే విద్యుత్ సిబ్బంది
- పూర్తిస్థాయిలో పర్యవేక్షణకు సిబ్బంది కరువు
- పట్టించుకోని దేవాదాయశాఖ.. భక్తులకు శాపం



మల్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో స్వామి వారి దర్శనానికి వచ్చిన గోదావరిఖనికి చెందిన రాజేశ్వరి అనే భక్తురాలు గురువారం విద్యుదాఘాతంలో మృతిచెందడం దేవస్థానం అధికారుల నిర్లక్ష్యమేననే సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యంవేలాది మంది, ఉత్సవాల సమయంలో లక్షలాదిగా భక్తులతో రద్దీగా ఉండే ఇక్కడ విద్యుత్‌కు సంబంధించి విధులు నిర్వహించే సిబ్బంది ఒక్కరేఉండడం చర్చనీ యాంశంగా మారింది. దేవస్థానం పరిధిలో 60కమర్షియల్, నీటి సరఫరాకు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు ఉండడం, దిగువకొండగట్టు, ఇతరప్రాంతాల్లోను కనెక్షలు వినియోగంలో ఉన్నాయి. వీటిని ఒక్కరు మాత్రమే పర్యవేక్షణ చేయడంప్రమాదాలకు కారణంగా పేర్కొంటున్నారు. దీనికితోడు రెండేళ్లగా ఇంజనీరింగ్ అధికారులు లేకపోవడంతో పనుల పర్యవేక్షణ బాధ్యతలను కూడా ఎలక్ట్రీషియన్‌కే అప్పగించినట్లు తెలుస్తోంది.

● విద్యుత్ తీగలు ఊడి..

కొండపైన కల్యాణకట్టలో ప్రతిఏటా జరిగే జయంత్యుత్సవాల సందర్భంగా దీక్షాపరులు మాలవిరమణ చేస్తుంటారు. దీంతో అక్కడేగల మూత్రశాల వద్ద ట్యూబ్‌లైట్ అమర్చారు. ఇటీవల కోతులు ట్యూబ్‌లైట్ తీగలు తెంచడంతో అవి అలాగే వేలాడుతున్నాయి. తరచూ కళ్యాణకట్టలోఇతర వాటి కోసం విద్యుత్ సరఫరా చేస్తుండగా తెగిన తీగల దానికి కూడా కరెంటు సరఫరా అవుతోంది. దీంతో బుధవారమే ఈ తీగలతో ఓ వానరం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. అప్పుడే తగుచర్యలు తీసుకుంటే గురువారం ప్రమాదం జరిగి ఉండేదికాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

● కొండపై లూజు తీగలే అధికం

కొండపైన విద్యుత్‌సిబ్బంది కొరతతో లూజు తీగలే అధికంగా దర్శనమిస్తుంటాయి. కోతులతో అవి కూడా వేలాడుతున్నాయి. తరచూ తీగలు తెగిప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ సిబ్బందిని నియమించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

- కొండగట్టు కల్యాణకట్ట దగ్గర ఘటన
- రక్షించబోయిన కోడలుకూ విద్యుదాఘాతం



రాజేశ్వరి(ఫైల్)

మల్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన రాజేశ్వరి అనే (84) వృద్ధురాలు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. పెద్దపల్లిజిల్లా గోదావరిఖనికి చెందిన సత్యనారాయణ తన తల్లి, భార్యతో గురువారం వేకువజామున కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చారు. రాజేశ్వరి కాలకృత్యాలు తీర్చుకునేందుకు కల్యాణకట్టవద్ద గల మరుగుదొడ్లవద్దకు వెళ్లింది. క్రమంలో వృద్ధురాలు అక్కడున్న బారికేడ్‌ను ముట్టుకోగా దానిపై తెగిపడిన విద్యుత్ తీగలు తాకి విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే రక్షించేందుకు రాజేశ్వరి కోడలు యత్నించగా ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబసభ్యులు స్థానికులసహాయంతో కల్యాణకట్టలో విద్యుత్‌సరఫరాను నిలిపివేశారు. అనంతరం వృద్ధురాలిని చికిత్స కోసం జగిత్యాలకుతరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందింది. ప్రమాదానికి ముందు మరుగుదొడ్లకు వెళ్లే మార్గాన్ని బారికేడ్‌తో మూసివేసినప్పటికీ కొండపైన తలనీలాల సేకరణ కాంట్రాక్టర్‌వద్ద పనిచేసే సురేశ్‌బాబు అనే వ్యక్తి తొలగించాడని సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా పోలీసులు గుర్తించారు.

● దేవస్థానం ఈవోతో పాటు పలువురిపై కేసు

విద్యుదాఘాతంలో తమ తల్లి రాజేశ్వరి మృతికి దేవస్థానం ఈవో, సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుమారుడు సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈవోతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మెట్‌పల్లి విద్యార్థుల ఎంపిక




జాతీయ స్థాయికి ఎంపికైన మెట్‌పల్లి విద్యార్థుల ప్రాజెక్టు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యస్తరీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జగిత్యాల జిల్లాకు చెందిన జడ్పీహెచ్‌ఎస్ (బాలికలు)- మెట్‌పల్లి విద్యార్థులు వర్షిత, వాగ్దేవిలు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెల 18 నుంచి 23వరకు భోపాల్‌లో జరిగే జాతీయస్థాయి రాజ్యస్తరీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరవుతారని పాఠశాల హెచ్‌ఎం కనకతార, గైడ్ టీచర్ సతీష్ కుమార్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ సత్యప్రసాద్, డీఈవో రాము, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్‌లు శుభాకాంక్షలు తెలిపారన్నారు. ఈ ప్రదర్శనలో బహుళ ప్రయోజన పంటల సంరక్షణ పరికరం రైతుల పంటల సంరక్షణలో ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారం అందిస్తుందని వారు తెలిపారు.



అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు మోగిన నగారా

- ఎన్నికల అధికారిగా డీసీవో మనోజ్‌కుమార్
- 12 డైరెక్టర్ పోస్టుల్లో ఒకటి ఎస్సీ, ఎస్టీ, రెండు మహిళలకు రిజర్వు
- 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న పరిశీలన... 25న తుది జాబితా విడుదల
- 1న పోలింగ్.. అదే రోజు ఫలితాల వెల్లడి



కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ అడిషనల్ రిజిస్ట్రార్ జి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఎన్నికల అధికారిగా జగిత్యాల జిల్లా సహకారశాఖ అధికారి సీహెచ్ మనోజ్‌కుమార్‌ను నియమించారు. నవంబరు 1న ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఓట్ల లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. 2017 ఏప్రిల్‌లో పాలకవర్గ పదవీ కాలం ముగియగా ఎనిమిదేళ్ళుగా ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమిస్తూ వచ్చింది.

ప్రస్తుత పర్సన్ ఇన్‌చార్జి కమిటీ పదవీకాలం మూడు రోజుల క్రితం ముగిసింది. ఈసారి కూడా ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జి కమిటీకి ఎక్స్‌టెన్షన్ ఇవ్వడమా... కొత్త కమిటీని వేయడమో జరుగుతుందనే ప్రచారం జరిగింది. దీంతో అర్బన్ బ్యాంకు సభ్యులతోపాటు పాలకవర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెల కొంది. అర్బన్ బ్యాం కు పాలకవర్గం, అధి కారులపై వేసిన నాలుగు కేసులను పరిశీలించిన న్యాయస్థానం గత మంగళవారం అన్నింటిని కొట్టి వేయడంతో ఎన్నికలకు మార్గం సుగమమైంది. ఎనిమిదేళ్ల తర్వాత ఎట్టకేలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో ఉత్కంఠకు తెరపడటమే కాకుండా సభ్యులతోపాటు బ్యాంకు వర్గాల్లో కూడా హర్షం వ్యక్తమవుతోంది.

12 మంది డైరెక్టర్ల ఎన్నికకు బ్యాలెట్ ద్వారా పోలింగ్ :

ప్రస్తుత నోటిఫికేషన్‌లో 12 మంది డైరెక్టర్లకు బ్యాలెట్ ద్వారా సీక్రెట్ ఓటింగ్ నిర్వహించాలని సూచించింది. 12 మంది డైరెక్టర్ స్థానాల్లో ఒక స్థానాన్ని ఎస్సీ లేదా ఎస్టీకి, రెండు డైరెక్టర్ స్థానాలను మహిళలకు, 9 డైరెక్టర్ పదవులను ఓపెన్ కేటగిరీకి రిజర్వు చేశారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. 24న నామినేషన్లను పరిశీలించి 25న తుది జాబితాను విడుదల చేస్తారు. నవంబరు 1న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్లను లెక్కిస్తారు.

కరీంనగర్, జగిత్యాల, గంగాధర అర్బన్ బ్యాంకుశాఖల్లో మొత్తం 9,300 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. 12 డైరెక్టర్ స్థానాలకు జరిగే ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు వచ్చిన మొదటి 12 మంది సభ్యులను ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. డైరెక్టర్ల ఎన్నిక అనంతరం ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా డైరెక్టర్లు ఎన్నుకుంటారు. అధికారుల నుంచి ఒకరిని, రిటైర్డు ఉద్యోగుల నుంచి ఒకరిని కో ఆప్షన్ సభ్యులుగా సహకారశాఖ అధికారులు నియమిస్తారు.

9,300 మంది సభ్యులకు ఓటు హక్కు

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు లైట్ బ్లూ కలర్ బ్యాలెట్, మహిళా స్థానాలకు పింక్ కలర్, ఓపెన్ కేటగిరీ స్థానానికి తెల్ల రంగు బ్యాలెట్ పత్రాలను వినియోగించాలని సూచించారు.

రద్దు చేసిన సభ్యులకు తిరిగి అవకాశం

2007-17 వరకు అధికారంలోఉన్న పాలకవర్గ సభ్యులు బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా సభ్యత్వాలు ఇచ్చారని, మరికొన్ని ఆరోపణలతో కొందరి సభ్యత్వాలను రద్దు చేసింది. దీంతో వారు కోర్టును ఆశ్రయించగా సభ్యత్వాల రద్దును కొట్టివేస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. పాత పాలకవర్గ కమిటీ సభ్యుల సభ్యత్వాలు యథావిధిగా కొనసాగడంతోపాటు తిరిగి పోటీచేసే అవకాశం లభించింది. ఆర్థిక లావాదేవీలతో కూడిన బ్యాంకు పాలకవర్గం ఎన్నికలను పార్టీరహితంగా నిర్వహిస్తున్నప్పటికి అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతరపార్టీలు వారి ప్యానల్స్‌తో ఎన్నికల బరిలో నాయకులను నిలుపుతారు. ఈసారి కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ పాలకవర్గం, తాజా మాజీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు రెండు ప్యానల్స్‌గా పోటీచేసే అవకాశాలున్నాయి.

ఉమ్మడి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

కమాన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడిజిల్లాస్థాయి ఆర్చరీ పోటీలను సెంటనరీకాలనీలోని రాణిరుద్రమాదేవి క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. ఇందులో పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల,జగిత్యాలజిల్లాల నుంచి సుమారు వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14,17విభాగంలో ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ తదితర అంశాల్లో పోటీల్లో తలపడ్డారు. ఇందులో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జిల్లా ఆర్చరీ ప్రధానకార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన వారంతా ఉమ్మడిజిల్లా తరఫున రాష్ట్రస్థాయికి ఆడతారని శ్రీనిత్యద్వితీయ,మితాలితృతీయస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, లింగం శ్రీనివాస్, వెంకటేష్, శిరీష, సింగరేణి క్రీడాకారులు రవి, అఖిల్, సంతోష్, అభిషేక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశం

భగత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపో మేనేజర్లతో రీజినల్ మేనేజర్ బి రాజు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ లక్కీ డ్రాను ప్రకటించింది. విజేతలైన కరీంనగర్‌కు చెందిన ఇ రమేష్‌కు 25 వేల రూపాయలు, గోదావరిఖనికి చెందిన సదానందంనకు 15 వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్ భూపతిరెడ్డి, పి మల్లేశం, రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం బి రాజు

రేపటి బంద్‌ను విజయవంతం చేయాలి

కమాన్‌పూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు దక్కాల్సిన 42 శాతం రిజర్వేషన్‌ను అడ్డుకుంటున్న కుట్రలను నిరసిస్తూ ఈనెల 18న రాష్ట్ర బంద్‌ను అన్నివర్గాల ప్రజలు, సంస్థలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల యజమానులు విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లాఅధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9ని వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టుకు వెళ్లడంతో స్టే ఇవ్వడం వల్లనే రిజర్వేషన్ ఆగిపోయిందన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తే బీసీలు స్వాగతించిన విషయాన్ని గుర్తుకు చేశారు. రాష్ట్రంలో బీసీ జనాభా ఎంతో రిజర్వేషన్ల వాటా అంతేస్థాయిలో ఉండాలని డిమాండ్ చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లోనే కాకుండా చట్టసభల్లో కూడా జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్ కల్పించేలా చట్టం చేయాలన్నారు. తోట రాజ్‌కుమార్, శంకర్, రాము, కొయ్యడ సతీష్ యాదవ్, అనిల్ గౌడ్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

సుల్తానాబాద్,(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న తలపెట్టిన బీసీ బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. వైశ్య భవన్‌లో పలువురు పాల్గొని బంద్‌పై సమీక్షించారు. తాళ్లపల్లి మనోజ్‌గౌడ్, నాగరాజు ఉన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బంద్‌కు టీఆర్ఎస్ డీ మద్దతు ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల, వివిధ రాజకీయ పార్టీల నేతలు, బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్‌లాల్‌లు పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ.. బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు, వ్యాపార, వాణిజ్య సంఘాలు మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని కోరారు. డిగంబర్, పెండ్యాల రామ్‌కుమార్, గుండ్ల సమ్మయ్య, కనవేన శ్రీనివాస్, సబ్బని సంతోష్, ప్రవీణ్, గణేష్, సురేష్, తిరుపతి, ప్రసాద్, లింగయ్యలు పాల్గొన్నారు.

మావోయిస్టు పార్టీ మద్దతు

మంథని, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన భాగంగా ఈనెల 18న జరిగే రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ పిలుపునిచ్చారు. జగన్ పేరిట గురువారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర బంద్‌కు మావోయిస్టు రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో బిల్లు పాస్ చేసి కేంద్రానికి పంపిందన్నారు. ఆతర్వాత జీవో నెం. 9ని విడుదల చేసిందన్నారు. స్థానిక సంస్థల విషయం రాష్ట్ర పరిధిలోనిదే అన్నారు.

రోడ్డంతా చెత్తమయం


మల్లన్న గుట్ట సమీపంలో రోడ్డుపై ఉన్న చెత్త

ధర్మారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పరిసర ప్రాంతాల రోడ్లన్నీ చెత్తమయం అవుతున్నాయి. ధర్మారం నుంచి ఎండపల్లికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం పడ వేస్తుండడంతో వాహనదారులు, వాకర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధర్మారంలోని దుకాణాదారులు తమ షాపుల్లో వ్యర్థాలను మల్లన్న గుట్ట సమీపంలోని రోడ్డుకు ఇరువైపులా పడవేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లతో పాటు వర్థాలు గాలికి రోడ్డుపైకి వస్తుండంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చికెన్ సెంటర్ నిర్వాహకులు వ్యర్థాలను క్రీడా మైదానం సమీపంలో పడ వేస్తుండంతో ఉదయాన్నే వాకింగ్ చేసే వారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై పేరుకపోయిన చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పెద్దయ్య దేవుడికి గ్రామస్థుల మొక్కులు

ధర్మారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొట్లవనపర్తి గ్రామస్థులు మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలంలోని పెద్దయ్య దేవుడిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. గ్రామం నుంచి యేటా పెద్దయ్య దేవుడిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని వారు తెలిపారు. పెద్దయ్యను దర్శించుకోవడం వల్ల గ్రామంలో పాడి పంటలు, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవిస్తున్నారని తెలిపారు. రెడపాక శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు బొట్ల శేఖర్, నీటి సంఘం మాజీ చైర్మన్, నేరెళ్ల అంజయ్య గౌడ్, మాజీ వార్డు సభ్యులు రెడపాక పోచయ్య, కొండ్ర బాబు, కొండ్ర రాజేందర్, రెడపాక నర్సయ్య, కొమ్ము మల్లేశం, ఆవుల రాజయ్య, బిరుదుల మల్లేశం ఉన్నారు.

స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

అంతర్గాం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్ అన్నారు. గురువారం సంఘ నాయకులతో కలిసి కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో తమ సంఘ భవనానికి స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. కార్యదర్శి లెంకల బ్రహ్మానందరెడ్డి, కోశాధికారి కరుణాకర్, అసోసియేట్ అధ్యక్షులు అలివేణి, ఉపాధ్యక్షుడు సాజిద్ అలీ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆహార దినోత్సవం

రామగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాల, పన్నూరు కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. కెవికె ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు, విటమిన్లు అందుకునే విధంగా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. అనంతరం 8,9 తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతి అందజేశారు. డాక్టర్ నవ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, శాస్త్రవేత్తలు వెంకన్న, బాస్కర్‌రావు, కిరణ్‌పిల్లి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివెల్

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివెల్‌ను నిర్వహించారు. విద్యార్థులు ఇంటి వద్ద తయారు చేసి తీసుకు వచ్చిన వంటకాలను పాఠశాలలో ప్రదర్శించారు. మక్క గడ్క, జొన్న అంబలి, గారెలు, సత్తు పిండి, గుడాలు, రాగిజావా మిల్లెట్స్‌తో విద్యార్థులు చేసిన వంటకాల ప్రదర్శన ఆకర్శించాయి. తెలంగాణ వంటకాలు, వాటి రుచులు, ప్రయోజనాల గురించి ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్ కుమార్ విద్యార్థులకు వివరించారు.

ఎలక్ట్రికల్ దుకాణాల మండల కార్యవర్గం

ధర్మారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండల ఎలక్ట్రికల్ అండ్ ఇంజనీరింగ్ షాప్స్ ఓనర్స్‌వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఎండి జహీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం యూనియన్ గౌరవ అధ్యక్షుడు కె.జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్షులతోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వెల్మ మల్లారెడ్డి, క్యాషియర్‌గా అమరేందర్, ప్రధానకార్యదర్శిగా సుతారి రవి, కార్యవర్గ సభ్యులుగా కే.శ్రీనివాస్ రెడ్డి, సామమల్లారెడ్డి, జె.కుమార్, జె.రాజేందర్, సాగర్, అంజనేయులు, జె.సుధాకర్, వి.రవి, ఎ.శ్రీనివాస్, నేరెళ్ల కిరణ్‌కుమార్, బ్రహ్మచారి, సదానందం, సంతోష్, చంద్రమౌళి, అరుణ్‌లను ఎన్నుకున్నారు.

వరి పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి


ముత్తారం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): ఖమ్మంపల్లి, సీతంపల్లి గ్రామాల్లో వరి పంటలను మండల వ్యవసాయ అధికారి అనూష గురువారం పరిశీలించారు. వరిలో ఆకు ఎండు తెగులు అధికమవుతుండడంతో పొలాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మొక్క పైభాగం నుంచి ఎండిన వరి గడ్డి మాదిరిగా బ్యాక్టీరియా కనిపిస్తుందని తెలిపారు. దీని నివారణకు ప్లాంటమైసిన్ లేదా, స్ట్రెప్టోమిసిన్‌ను పిచికారి చేయాలని సూచించారు. పంట తెగులు ఆశించిన పొలంలో నీటిని నిలిపి వేయాలన్నారు. కంకి నల్లి కూడా వరి పైరులో గుర్తించినట్లు తెలిపారు. స్పైరోమెసిఫెన్ 1 మిల్లీ లీటర్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు. ఆయా గ్రామాల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో ఆవిష్కరణ ఎంపిక


జేఎన్టీయూ కళాశాలలో ఎంపికైన విద్యార్థులు

రామగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025లో భాగంగా గత నెలలో కళాశాలలో ఇంటర్నల్ హ్యాకథాన్ నిర్వహించారు. కళాశాలకు చెందిన 23 టీంల విద్యార్థులు నూతన ఆలోచనలతో పాటు ఆవిష్కరణలకు సంబంధిత పోర్టల్‌లో సమర్పించారు. ఎం పికైన 20 టీంల విద్యార్థులు నూతన ఆలోచనలను పోర్టల్‌లో సమర్పిస్తారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ సర్టిఫికెట్లు అందజేశారు. మొదటి స్థానాన్ని సురక్ష ప్రాజెక్టు, సైన్స్ విజన్‌కు ద్వితీయ స్థానం, టెక్స్‌ఫైర్‌కు మూడో స్థానం దక్కిందని ప్రిన్సిపాల్ తెలిపారు. మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, కోఆర్డినేటర్ అజ్మీర నరహరి, శ్రీనివాస్‌రావు, నవ్య, స్నేహ, శివరామకృష్ణ, రవికాంత్, పరిపాలనాధికారి సుమన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఖని కరస్పాండెంట్‌కు పురస్కారం


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న కంది రవీందర్‌రెడ్డి

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గీతాంజలి హైస్కూల్ కరస్పాండెంట్ కంది రవీందర్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. డాక్టర్ అబ్దుల్ కలాం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కలాం జయంతి వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతులమీదుగా డాక్టర్ కలామ్స్ స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు-2025ను రవీందర్‌రెడ్డి అందుకున్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఓదెల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కనగర్తి గోపరపల్లి, కొలనూర్, గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను గురువారం ఎమ్మెల్యే విజయరమణారావు పరామర్శించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి, భైరి రవి, రాజయ్య, మహేందర్ రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నదాతలకు అడవి పందుల బెడద

(3వ పేజీ తరువాయి)

ఎకరాల్లో పత్తి దెబ్బ తిన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి చేలు, వరి పొలాలను పందులు పాడు చేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రధాన రహదారులకు పక్కనే ఉన్న పంట పొలాలు, చేలల్లోకి పగలు, రాత్రి తేడా లేకుండా రావడంతో అన్నదాతలు బెంబేలెత్తిపోతున్నారు. పందుల బెడదను తప్పించడానికి కొందరు రైతులు పాత చీరెలను కొనుగోలు చేసి చేన్ల చుట్టూ కడుతుండగా మరి కొందరు రైతులు గట్లపై కర్రలుపాతి సెంట్రింగ్ వైర్‌ను కడుతున్న ఆశించిన ఫలితాలు లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పంట పొలాల వద్దకు వెళ్లాలంటేనే రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో పందుల దాడిలో కొందరు చనిపోయిన, తీవ్రంగా గాయపడ్డ సంఘటనలున్నాయి.

వేతనం చెల్లించాలని విధులు బహిష్కరణ

జ్యోతినగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు వేతనం చెల్లించాలని గురువారం విధులు బహిష్కరించారు. బెంగళూరుకు చెందిన కంపెనీ కాంట్రాక్టు కార్మికుల సెప్టెంబరు నెలకు సంబంధించి చెల్లించడం లేదన్నారు. తప్పని పరిస్థితుల్లో విధులు బహిష్కరించామన్నారు. టిటిఎస్‌లోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ యూసుఫ్‌కు వినతి పత్రం అందజేశారు.

ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

ముత్తారం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం మండలంలోని దరియాపూర్ తెలంగాణ మాడల్ స్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల తో మాట్లాడారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యా యులు అందిస్తున్న నాణ్యమైన విద్యా సేవలను ఆయన అభినందించారు. విద్యార్థులు పాఠశాలలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అధికారులు ఉన్నారు.

వికాస తరంగిణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

మండల కేంద్రంలోని రైతువేదికలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో బొల్లినేని అశోక్ సతీమణి మంగ జ్ఞాపకార్థం చల్మెడ ఆసుపత్రి వైద్యులతో మహిళలకు ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. మహిళలకు గర్భాశయం, రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన వాటిపై వైద్యులు అవగాహన కల్పించారు. అనంతరం 225 మంది మహిళలకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా వైద్యాధికారి వాణిశ్రీ సందర్శించారు. వికాస తరంగిణి అందిస్తున్న వైద్య సేవలను వారు కొనియాడారు. మండల వైద్యాధికారి అధికారి అమరేందర్ రావు, ఎంపీడీఓ సురేష్ తదితరులు ఉన్నారు.

వైద్య సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలి


ఆసుపత్రి సిబ్బందికి టీకా వేస్తున్న వైద్యులు

ముత్తారం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి వాణిశ్రీ అన్నారు. ముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. వైద్య సిబ్బందికి హైపటైటీస్ వైరస్ సోకకుండా ఉండేందుకు వ్యాక్సిన్‌ను అందిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, వైద్యసిబ్బంది దీనిని వేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. టీబీ కమ్యూనికేబుల్ డీసీజెస్, ఎఎంసి రిజిస్ట్రేషన్, డెలివరీలు తదితర అంశాలపై సూచనలు, సలహాలు చేశారు. వైద్య సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించాలని, రోగులపై దురుసుగా ప్రవర్తించవద్దని, వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. అలాగే ఇన్‌పేషెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని రిజిష్టర్లను పరిశీలించి, సందేహాలను నివృత్తి చేసుకున్నారు. జిల్లా టీవీ ప్రోగ్రామింగ్ డాక్టర్ సుధాకర్, జిల్లా ఇమినేషన్ ఆఫీసర్ కిరణ్ కుమార్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తరిస్తాం

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తరిస్తామని ట్రస్ట్ అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో స్వచ్ఛందంగా సేవలందిస్తున్న నలుగురు వలంటీర్లకు గౌరవ వేతనం అందించే కార్యక్రమం గురువారం జరిగింది. వారి అంకితభావాన్ని గుర్తించి ట్రస్ట్ ఒక్కొక్కరికి 4 వేల 5 వందల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన గంట రాములు యాదవ్, మేకల మల్లేశం యాదవ్‌తోపాటు సందనవేని రాజేందర్ యాదవ్, గొడుగు రాజకుమార్ యాదవ్ లకు ట్రస్ట్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. గొడుగు రాజ్ కుమార్, బత్తిని లక్ష్మణ్ యాదవ్, మేకల కొమురయ్య ,మల్లెత్తుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) జిల్లా ఆస్పత్రిలో 24 గంటలు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. గురువారం జిల్లా ఆస్పత్రిని సందర్శించి నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవన పనులను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా రోజు ఒక్కో రకం రంగు బెడ్ షీట్ లను వినియోగించడం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతోందన్నారు. సెప్టెంబరులో 250 మంది గర్భిణిలకు ప్రసూతి సేవలు అందించారని, 123 మందికి టిఫా స్కా నింగ్ చేశారని, 316 మందికి ఆరోగ్యశ్రీ సేవలు అందించి ప్రైవేట్‌కు దీటుగా వైద్యసేవలు అందించామన్నారు. ప్రసవాలు పెరిగాయని,ఇతర జిల్లాల నుంచి వైద్యానికి ఇక్కడికి వస్తున్నారన్నారు. వెంటిలేటర్లు, సిటీ స్కాన్, ఎంఆర్ఐ పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రోగులు అసంతృప్తితో ఉండకూడదని ఉద్దేశ్యంతో పని చేస్తున్న సిబ్బందికి డీసీహెచ్ శ్రీధర్‌కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా వైద్య శాఖ అధికారులు, డాక్టర్స్ మార్కెట్ చైర్మన్లు, భూతగడ్డ సంపత్ శ్రీనివాస్. సయ్యద్ మస్రత్, సుభాష్, కలవేన మహేందర్, జగదీష్ పాల్గొన్నారు.

బీసీ సంఘం బలోపేతానికి పటిష్ట చర్యలు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) బీసీ సంఘం బలోపేతానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటామని బీసీ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ ఆదేశాల మేరకు నియామకాలు చేపట్టామన్నారు. బీసీల సత్తా చాటేందుకు ఐక్యంగా ముందుకు సాగుదామని ప్రతినబూనారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కందుల సదాశివ్ ఆధ్వర్యంలో, రాష్ట్ర జనరల్ సెక్రటరీ సురేష్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు సింగారపు రవికుమార్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల అశోక్ పటేల్ సమక్షంలో నియామక పత్రాలు అందజేశారు. జిల్లా సలహాదారులుగా మంద భాస్కర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులుగా దాసరి కొమురయ్య యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షులుగా గోవిందుల ఎల్ల స్వామి, ఎలిగేడు మండల అధ్యక్షులుగా బింగి రాజు, మండల యూత్ అధ్యక్షునిగా మొలుగూరి పరశురామ్ గౌడ్, జూలపల్లి మండల జనరల్ సెక్రటరీగా అమిటిషెట్టి శ్రీనివాస్, కనగర్తి గ్రామ అధ్యక్షులు పారిపెల్లి తిరుపతి, నాగులపల్లి గ్రామ అధ్యక్షులు కందుకూరి వెంకటయ్య, ఉపాధ్యక్షులు అమీరిశెట్టి రాజారెడ్డి లని నియమించారు. బీసీల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తామని, బీసీల హక్కులకై పోరాడుతామని నూతనంగా నియామకమైన వారు తెలిపారు.

వార్డు అధికారులు మరింత అంకితభావంతో పని చేయాలి

కోల్‌సిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మున్సిపల్ సేవలు సమర్థవంతంగా అందడాకిఇ వార్డు అధికారులు అంకితభావంతో పని చేయాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే అరుణ శ్రీ అన్నారు. గురువారం వార్డు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు లక్ష్యం ప్రకారం వసూలు చేయాలన్నారు. భారీ బకాయిలు ఉన్న వారికి రెవెన్యూ రికవరీ చట్టం కింద నోటీసులు జారీ చేయాలన్నారు. డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. మున్సిపల్ సేవలకు సంబంధించి గమనించిన సమస్యలు, ప్రజలు దృష్టికి తెచ్చిన ఇబ్బందులను త్వరితగతిన అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే మెటీరియల్ స్వాధీనం చేసుకొని జరిమానా విధించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేసిన వారి నుండి అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. కార్పొరేషన్ అదనపు కమిషనర్ మారుతి ప్రసాద్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఓ ఆంజనేయులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, ఆర్‌ఐలు శంకర్ రావు, ఖాజా, వార్డు అధికారులు, వార్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చిరంజీవి హత్య కేసు విచారణను పారదర్శకంగా నిర్వహించాలి

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సెంటినరీ కాలనీలోని మీసేవ నిర్వాహకుడు కోట చిరంజీవిని ఈ నెల 10న హత్య చేశారని, ఈ హత్య కేసు విచారణ పారదర్శకంగా నిర్వహించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర ప్రకాష్ డిమాండ్ చేశారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాల్సి ఉండగా హత్య చేయడంతో ఆయన ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారని అన్నారు. చిరంజీవి సెల్‌ఫోన్ డాటాను, సంధ్యారాణి సెల్‌ఫోన్ డాటాను, సీసీ ఫుటేజీలను పరిశీలించాలన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నేతకాని సంఘం నాయకులు మల్లేష్, కామెర పద్మ, వీరయ్య, పర్వతాలు, నరేష్, రమేష్, అన్వేష్, శ్రీజ, సాయిచరణ్, రాంచరణ్, నవత, సారమ్మ, సాయిచరణ్, అక్షయ, శ్యామల, శివ పాల్గొన్నారు.

ఘనంగా మాస్టర్ ఓరెంటర్ కాంటెస్ట్

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మార్కండేయకాలనీలోని నారాయణ పాఠశాలలో గురువారం ఓరెంటర్ కాంటెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్ జోన్ ఏజీఎం చైతన్యరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవడం వల్ల చిన్న వయస్సు నుంచే అన్ని రంగాల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం కిడ్స్ చాంప్స్ పిల్లలు పాల్గొని వారి ప్రతిభను కనబర్చారు. కమ్యూనికేషన్ నైపుణ్యంపై విద్యార్థులు ఆటాపాటలతో నృత్యాలు చేశారు. చాంప్స్ ఆర్ అండ్ డిహెచ్ స్వాతిలక్ష్మి, సాఫ్ట్ స్కిల్స్ లీడ్ గీతాకుమారి, ఆర్ ఐ సత్యంరావు, ప్రిన్సిపల్స్ రజని, భాస్కర్‌రెడ్డి, స్రవంతి, రమ్య, క్రాంతిపాల్, శాంతి కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.


బహుమతులతో విద్యార్థులు



మారుపేర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మారుపేర్ల డిపెండెంట్ల సంఘం నాయకులు

గోదావరిఖని, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో విజిలెన్స్ పెండింగ్ పేరిట మారుపేర్ల డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని సంఘం నాయకుడు జక్కు శ్రావణ్ ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సింగరేణిలో విజిలెన్స్, మారుపేర్ల డిపెండెంట్ల సమస్యలను పరిష్కరించడం లేదని, చాలా మంది ఉద్యోగాలు వస్తాయని వేచి చూసి కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఉద్యోగం వస్తుందనే ఆశతో ఉన్న మారుపేర్ల డిపెండెంట్లు పూటగడవక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీలకు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదని, ముఖ్యమంత్రితో మాట్లాడుతామని హామీ ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. అంజయ్య, డిష్ బాబు, రాజయ్య, సుధాకర్, ఓం ప్రకాష్, సత్యం, ప్రదీప్ శర్మ, రవి కుమార్, హరీష్, సంతోష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్కూల్ బస్‌లను పునరుద్ధరించాలి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాలనీ, సెంటినరీ కాలనీల నుంచి గోదావరిఖని పాఠశాలలకు సింగరేణి యాజమాన్యం నడుపుతున్న బస్ సర్వీస్‌లను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ ఆర్జీ-2 అసిస్టెంట్ బ్రాంచి సెక్రెటరీ సాంబశివరావు ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు పద్ధతిలో బస్‌లను నడిపించేదని తెలిపారు. సకాలంలో అద్దె చెల్లించకపోవడంతో బస్‌లు నిలిపివేశారన్నారు. గురువారం విద్యార్థులు బస్‌ల కోసం రోడ్లపై గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఇక్కట్లు దృష్టిలో ఉంచుకుని బస్‌లకు సంబంధించి బాకీలను చెల్లించాలని, లేదా ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేయాలని ప్రకటనలో డిమాండ్ చేశారు.

నేడు 8ఏ గని మృతుల సంస్మరణ సభ

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): 8ఏ గని ప్రమాద మృతుల సంస్మరణ సభ శుక్రవారం స్తూపం వద్ద నిర్వహించనున్నట్లు గని ప్రమాద మృతుల కుటుంబ సభ్యులు ప్రకటనలో తెలిపారు. 8ఏ గనిలో 2003 అక్టోబర్ 16న సెకండ్ షిఫ్టు ముగింపు సమయంలో గని పైకప్పు బండరాయి కూలిన ప్రమాదంలో 10 మంది కార్మికులు మరణించారు. ఆనాటి ప్రమాదానికి 22 ఏళ్ళు పూర్తయ్యాయి. శుక్రవారం జరిగే కార్యక్రమంలో కార్మిక సంఘాలు, పార్టీల నాయకులు పాల్గొనాలని పేర్కొన్నారు..

జీఎం(హెచ్ఆర్‌డీ)కి సన్మానం

గోదావరిఖని, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం కార్పొరేట్ జీఎం(హెచ్ఆర్‌డీ) వెంకటరామరెడ్డి ఈ నెలలో పదవి విరమణ చేయనున్న సందర్భంగా గురువారం ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అధ్యక్షతన వివిధ డిపార్ట్‌మెంట్ల ఉన్నతాధికారులు సన్మానించారు. ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్, ఏరియా ఇంజినీర్ రామ్మోహన్, ఏజంట్ ఎల్ రమేష్, సాయి ప్రసాద్, రవీందర్‌రెడ్డి, శివ నారాయణ, లక్ష్మిరాజు, పాల్గొన్నారు.

కార్మికులను వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికులను వేధింపులకు గురి చేస్తే గుర్తింపు సంఘం ఏఐటీయూసీ చూస్తూ ఊరుకోదని, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న అధికారులను కార్మికులే తరిమికొట్టే పరిస్థితి వస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు పేర్కొన్నారు. గురువారం జీడీకే వన్ సీఎస్‌పీలో గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సీఎస్‌పీలో అధికారులు కొందరు కార్మికులను, సూపర్‌వైజర్‌లను ఇన్‌ఫార్మర్లుగా వాడుకుంటూ కార్మికుల ఫొటోలు, వీడియోలు తీసి వేధింపులకు గురిచేయడంపై మండిపడ్డారు. కార్మికులను వేధింపులకు గురి చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. అధికారులు నియంత లాగా వ్యవహరిస్తూ, వారికి నచ్చిన కార్మికులను ఎలాంటి విధులు అప్పచెప్పకుండా మస్టర్లు ఇస్తున్నారన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న అధికారులపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని, లేకుంటే కార్మికులకు ఏఐటీయూసీ అండగా ఉంటూ పోరాటాలు చేస్తుందని వారు పేర్కొన్నారు. సయ్యద్ సోహేల్, వెంకట్‌రెడ్డి, బండి మల్లేష్, ఎంఎ గౌస్, సమ్మయ్య, జానీమియా, రాజేశ్వరరావు, సుభాష్, పాల్గొన్నారు.